క్లుప్తంగా

ఘనంగా సయ్యద్‌బురానుద్దీన్ ఉరుసు


దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ క్రాస్‌లో వెలిసిన శ్రీ సయ్యద్ దాదాపీర్ సాహెబ్ దర్గా ఉరుసు ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా బాషా పీర్‌సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా ఆలయ 10వ వార్షికోత్సవం


హోమం, పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన అంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయ అర్చకులు పూజారి ఉమేష్, నర్సప్పలు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి.. వివిధ రకాల ప్రత్యేక ఫలపుష్పాలతో స్వామిని పూజలు చేశారు. అంతకు ముందు దేవాలయంలోని సీతారాములకు పురోహితులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. హోమ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


మృతి చెందిన వృద్ధుడు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఎల్లమ్మ దేవి ఆలయ మైదానం ఓ 60 వయస్సు గల అనాథ వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. ఆయన కొద్ది కాలంగా కోసిగిలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. ఆదివారం మైదానంలో అతను విగత జీవిగా పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డికి సమాచారం ఇచ్చారు. వారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్మికులు ట్రాక్టర్‌లో మృతదేహాన్ని తీసుకెళ్లి సజ్జల గుడ్డం రోడ్డులోని శ్మశాన వాటికలో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్సీలకు సమాన హక్కులు కల్పించాలి

ఆదోని రూరల్: దళితులకు సమాన హక్కులు కల్పించాలని బీఎస్‌ఎస్ స్టేట్ ప్రెసిడెంట్ రామతీర్థం అమరేష్, జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు సుమల చార్లెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని జి.హొసళ్లి గ్రామాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి సంవత్సరం మారెమ్మ, సుంకులమ్మ దేవర సందర్భంగా దేవతలకు కుంభాల ఊరేగింపు జరుగుతుందని, అయితే చివరగా ఎస్సీల కుంభాలు వెళ్లాలని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిఏడాది ఇలానే దళితుల పట్ల అగ్రకులాల వారు వివక్ష చూపుతున్నారన్నారు. వెంటనే దీనిపై విచారణ చేపట్టి దళితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.హొసళ్లి గ్రామస్తులు రాము, రాఘవ, మల్లికార్జున, బసవరాజు, సురేష్, రాఘవేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సీతారాముల దర్శనభాగ్యం


నిర్మాణం పూర్తయిన శ్రీ సీతారామ విగ్రహాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని రణమండల కొండకు వెళ్లే దారిలో శ్రీ సీతారాముల విగ్రహాలు భక్తులకు దర్శనభాగ్యం కల్పించేందుకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. నిర్మాణ పర్యవేక్షకుడు అశోక్ ఆధ్వర్యంలో దాతల సాయంతో నూతనంగా సీతారాముల విగ్రహాలను ప్రత్యేక కళాకారులతో ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాకుండా ప్రత్యేక రంగులతో సీతారాముల విగ్రహాల నిర్మాణం చేపట్టారు. మార్గశిర మాసం (ఫిబ్రవరి)లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించేందుకు ప్రారంభోత్సవం చేస్తామని అశోక్ తెలిపారు.

ఒక్కడే బోధకుడు.. సాగని చదువులు

- మంత్రాలయం నియోజకవర్గంలో 19 పాఠశాలల్లో ఒకే ఒక ఉపాధ్యాయుడు
- అన్ని తరగతులకు ఒక్కటే పాఠం
- కుంటు పడుతున్న విద్యా బోధన
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కోసిగి మండలంలోని గౌడుగల్లు పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 82 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు మూడు టీచర్ పోస్టులకు గానూ ఒకరే ఉన్నారు. నాలుగేళ్లుగా ఒక్కరే పాఠాలు చెబుతున్నారు. ఐదు తరగతులు కలిపి బోధిస్తుండడంతో విద్యార్థుల చదువులు గందరగోళంగా మారాయి. అలాగే తుంబిగనూరు గ్రామంలో 80 మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడ కూడా ఇదే పరిస్థితి ఉంది. పాఠశాల నిర్వహణ, రికార్డులు నిర్వహణ, మధ్యాహ్న భోజన పథక నిర్వహణ చూసుకునేందుకు ఉన్న ఉపాధ్యాయుడికి సరిపోతోంది. దీంతో విద్యార్థులకు చదువులు చెప్పే నాథులే కరువయ్యారు. ఇలా ఈ రెండు చోట్లనే కాదు నియోజకవర్గంలోని మరికొన్ని పాఠశాలలోనూ ఇదే పరిస్థితి ఉంది.

కోసిగి: అక్షరాస్యతలో అట్టడుగు స్థాయిలో ఉన్న మండలం కోసిగి. ఈ మండలంపై ప్రభుత్వం, పాలకులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను పట్టించుకోకపోవడంతో చాలా వరకు ప్రాథమిక పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు కరువయ్యారు. ఐదు తరగతులకు ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులతో గందరగోళం మధ్య చదువులు సాగుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థను నీరుగార్చేస్తోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

19 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులే..

మంత్రాలయం నియోజకరవ్గంలో కోసిగి , కౌతాళం, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాలలో 198 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 51,461 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కాగా నియోజకవర్గంలోని 19 పాఠశాలలో ఏకోపాధ్యాయులే దిక్కుగా మారింది. మరో 5 స్కూళ్లలో టీచర్లే లేరు. టీచర్లు లేని స్కూల్‌లలో డిప్యూటేషన్‌పై కొనసాగిస్తున్నారు. కాగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల నిర్వహణ, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రాలకు వెళ్తుంటాడు. దీంతో విద్యార్థులకు పాఠాలు చెప్పే నాథులే లేకుండా పోయారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లామా.. మధ్యాహ్నం భోజనం చేశామా.. ఇంటికి వచ్చామా అనే తీరున నడుస్తోందని, చదువులు మాత్రం సాగడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు చదువులకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గౌడుగల్లులో 3,4,5 తరగతులకు కలిపి బోధిస్తున్న ఉపాధ్యాయుడు


ఉపాధ్యాయులు లేక ఖాళీగా ఉన్న 1,2 తరగతుల విద్యార్థులు

ఏకోపాధ్యాయ పాఠశాలలు

ప్రాథమిక, పాఠశాలలో పనిచేసే వారి కన్నా, ఖాళీగా ఉన్న పోస్టులు ఎక్కువగా ఉన్నాయి. కోసిగి మండలంలో దేవరబెట్ట, గౌడుగల్లు, తుంబిగనూరు గ్రామాల్లో ఒకే టీచర్ ఉన్నారు. ఎస్.కొట్టాల గ్రామంలో టీచర్ లేక డిప్యూటేషన్ పై ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే కౌతాళంలో ఉర్లదిన్నె, పొదలకుంట, వల్లూరు-కొత్తగ్రామం, హాల్వి ఎస్‌డబ్ల్యూ, ఓబులాపురం, తిమ్మాపురం, కౌతాళం ఉర్దూ పాఠశాలలో ఒక టీచరే ఉన్నారు. చూడి, ఉరుకుంద ఎస్‌డబ్ల్యూ, కుంబళూరు క్యాంప్ గ్రామాల్లో ఒక్క టీచర్ కూడా లేదు. ఇక్కడ డిప్యూటేషన్ పై కొనసాగుతున్నారు. పెద్దకడబూరు మండలంలో చిన్నతుంబళం, బాపురం పాఠశాలలో సింగిల్ టీచర్ కొనసాగగా, కంబళదిన్నె గ్రామంలో టీచర్‌లేక డిప్యూటేషన్ కొనసాగుతున్నాడు. మంత్రాలయం మండలంలో సుంకేశ్వరి, కాచాపురం, ఉర్దూ స్కూల్‌లలో సింగిల్ టీచర్ కొనసాగుతున్నాడు.

మంత్రాలయం నియోజకవర్గంలో పాఠశాలలు.. ఖాళీల వివరాలు .

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పోస్టులు	పనిచేస్తున్నవారు	ఖాళీలు
కోసిగి	48	13,850	221	73	148
కౌతాళం	59	14728	263	131	132
పెద్దకడబూరు	43	11433	201	126	175
మంత్రాలయం	48	11450	201	132	169
మొత్తం	198	51,461	886	462	624

ఉపాధ్యాయుడిని నియమించాలి



మాది చిన్న గ్రామం. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 80 మంది పిల్లలు చదువుతున్నారు. మా ఇద్దరు కుమార్తెలు మధులత 4వ తరగతి, ఇందు 3వ తరగతి చదువుతోంది. ఐదు తరగతులకు ఒకే టీచర్ ఉన్నాడు. అందరికి కలిపి బోధిస్తున్నాడు. పిల్లలకు ఏమి చదువు అర్థం కావడం లేదు. ఉపాధ్యాయులను నియమిస్తే చాల బాగుంటుంది.

– మహాదేవా, గౌడుగల్లు

ఏమీ అర్థం కావడంలేదు



పాఠశాలలో 3,4,5వ తరగతి కలిసి ఒకే చోట కూర్చొబెట్టి బోధిస్తున్నారు. రోజు ఒకే పాఠం చదువుకోవాల్సి వస్తోంది. చాల పాఠాలు పెండింగ్‌లో ఉండి పోయాయి. సారు చెప్పించే చదువుకోవాలి. అన్నీ క్లాస్ కలిసి చదువకోవడంతో ఏమి అర్థం కావడం లేదు. – మధు, 5వ తరగతి విద్యార్థి, గౌడుగల్లు

డిప్యూటేషన్‌లతో ఖాళీలు లేకుండా చూస్తాం



మంత్రాలయం, కోసిగి మండలాలలో సింగల్ టీచర్ ఉన్న పాఠశాలలను పర్యవేక్షణ చేస్తున్నాం. ఆ పాఠశాలలో అత్యవసర నిమిత్తం సెలవు పెడితే వారి స్థానంలో డిప్యూటేషన్‌పై మరో ఉపాధ్యాయుడిని నియమిస్తున్నాం. విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా చుస్తున్నాం. త్వరలోనే కొత్త డీఎస్సీతో పోస్టులు భర్తీ అవుతాయి, ఆందోళన చెందాల్సి అవసరం లేదు.

– మెయినుద్దీన్, ఎంఈఓ

నీటి సరఫరా సక్రమంగా చేయండి


పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజలకు నీటి సరఫరా సక్రమంగా చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. ఆదివారం మండలంలోని బసాపురం -104 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వి.కొండాపురం చెరువును పరిశీలించారు. అలాగే పంప్‌హౌస్‌లో తాగునీటికి సంబంధించిన పనులను పర్యవేక్షించారు. అనంతరం బసాపురం-104 గ్రామానికి సంబంధించి తాగునీటి పీడబ్ల్యూఎస్ స్కీంను సందర్శించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిని ఫిల్టర్ చేసి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్‌అలీ, డీఈఈ గోపీనాథ్, డ్వామా ఏపీడీ లోకేశ్వర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మధుకృష్ణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు భాస్కర్, బసవరాజు కోరారు. ఆదివారం పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఏపీ ఎంటీఎఫ్ నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పదోన్నతుల ప్రక్రియలో ఒక ఉపాధ్యాయుడు పదోన్నతి వద్దని చెప్పిన తర్వాత తదుపరి ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. అయితే కర్నూలు విద్యాశాఖాధికారులు మాత్రం తదిపరి ఉపాధ్యాయులకు అవకాశం కల్పించకుండా, ఆయా సబ్జెక్టుల పదోన్నతులను నిలిపి వేస్తున్నారని చెప్పారు. ఇతర జిల్లాలో పదోన్నతులు వద్దని చెప్పిన తర్వాత తదుపరి ఉపాధ్యాయుడు సీనియారిటీ జాబితాను బట్టి అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. ఇక భాష పండితుల పోస్టులకు వివిధ జిల్లాలో పదోన్నతులు కల్పించినా మన జిల్లాలో మాత్రం కల్పించడం లేదన్నారు. అధికారులు స్పందించి అర్హత కలిగిన ఉపాధ్యాయులకు తగు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ నాయకులు కోటన్న, బడుగు బసవరాజు, ప్రతాప్ రెడ్డి, సుధాకర్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం


మాట్లాడుతున్న అధ్యాపకురాలు జిబి.వేదవతి


ఎమ్మిగనూరులో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం అధ్యాపకులు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోవిందరాజులు, అధ్యాపకురాలు జి.బి. వేదవతి గణిత శాస్త్రం విస్తృతికి రామానుజన్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివయ్య, బాబు, శ్రీనివాసులు, బడే సాబ్, శాంతిస్వరూప్, రంగన్న, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. మిల్టన్ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

గణిత మేధావి రామానుజన్


ఎమ్మిగనూరుటౌన్: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. రామానుజన్ జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి ఎస్టీయూ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, చంద్రోశేఖర్, ప్రసన్నరాజు, లక్ష్మన్న, సరళ, రంజాన్, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు


ఎంబీ చర్చి ఆవరణలో వేడుకలు జరుపుకుంటున్న క్రైస్తవులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంబీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. క్రీస్తు బోధనలు వినిపించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు భాస్కర్‌బాబు, రాజశేఖర్, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'గరివిడి లక్ష్మి' సినిమా టైటిల్ లాంచింగ్


గరివిడి లక్ష్మి సినిమాకు క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: గరివిడి లక్ష్మి సినిమా టైటిల్ లాంచింగ్ సంబరాలు ఆదోని పట్టణంలో ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ48 బ్యానర్‌పై పట్టణానికి చెందిన టీజీ విశ్వప్రసాద్ నిర్మాతగా వ్యవహరించిన సినిమా 'గరివిడి లక్ష్మి' టైటిల్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పట్టణశివారులోని ఆస్పరి రోడ్డులో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డా.పార్థసారథి, ఎమ్మెల్సీ మధుసూదన్ పాల్గొని సినిమా క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. హీరోగా రాగమయూర్, హీరోయిన్ ఆనంది, నటీనటులు నరేష్, శరణ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గరివిడి లక్ష్మి అనే మహిళ విజయనగరంలో బుర్రకథ కళాకారిణి. ఆమె బుర్రకథ చెబుతూ ప్రజల్లో విప్లవాత్మక తెచ్చేదని తెలిపారు. ఆమె చరిత్రను సినిమాగా తీస్తున్నట్లు తెలిపారు.

క్రీడా సామగ్రి విరాళం


దాతకు రాయరు జ్ఞాపిక అందజేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం : శ్రీమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిమళ విద్యానికేతన్ పాఠశాలకు బెంగళూరుకు చెందిన సుబ్బనరసింహా అనే దాత క్రీడా సామగ్రిని విరాళంగా అందజేశారు. ఆదివారం శ్రీమఠం పీఠాధిపతి సుబధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల విలువజేసే క్రీడా సామగ్రి ఇచ్చారు. అలాగే సుజయీంద్ర కళాశాలలో సైన్స్ ల్యాబ్ పరికరాలను పీఠాధిపతి పరిశీలించారు. అనంతరం దాతకు రాయరు జ్ఞాపిక అందజేసి ఆశీర్వదించారు. స్వామిజీతో పాటు ప్రిన్సిపాల్ రవీంద్ర, అధ్యాపకులు కొండయ్య, ప్రహ్లాద, పీఈటీ వెంకటేష్ ఉన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోని రూరల్: మాలమహానాడు వ్యవస్థాపకులు స్వర్గీయ పీవీ రావు 19వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించి, వర్గీకరణను రద్దు చేయించిన మహానుభావుడు పీవీ రావు అని చెప్పారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, అడ్వైజర్ కేశవ్, మాస్టర్ చంద్రోఖర్, నరేష్‌కుమార్, మరకట్టు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సంజీవయ్య నగర్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో ఆదివారం మాలమహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు 19వ వర్ధంతిని ఆ సంఘ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసన్న, నాయకులు రవిచంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు.

30 శాతం ఐఆర్ ఇవ్వాలి


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం సత్వరం 30 శాతం మధ్యంతర భృతితో పాటు పెండింగ్‌లో వున్న డీఏలను మంజూరు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధనుంజయ, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్ మాట్లాడారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌లను అమలు చేసి జేఎల్, డైట్ అధ్యాపకుల పోస్టులను, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను, జెడ్పీ ఉపాధ్యాయ పదోన్నతులను చేపట్టాలని కోరారు. సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు శంకరప్ప, మల్లికార్జున రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులపై ప్రత్యేక నిఘా


మాధవరం చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్‌బాబు

మంత్రాలయం : రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్ పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం.సుధీర్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన కర్ణాటక సరిహద్దులోని మాధవరం చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టుల నుంచి అక్రమ మద్యం సరఫరా కాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఇక్కడ అమర్చిన సీసీ కెమెరాలను జిల్లా, రాష్ట్ర కంట్రోల్ రూములకు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ ఇస్మాయిల్, బీఎంపీపీ సీఐ మోహిద్దీన్ బాషా, చెక్‌పోస్టు సీఐ చంద్రోశేఖర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


ద్విచక్ర వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

నందవరం : ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం మండల పరిధిలోని ధర్మపురం టోల్‌గేట్ వద్ద ఎస్‌ఐ వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నింబంధనలు పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించి ధ్రువ పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, రోడ్డు టాక్సీ వంటి పత్రాలను వాహనాలలో ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో భాగంగా రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు తెలిపారు. మంత్రాలయానికి చెందిన భీమేష్, చిలకలడోణకు చెందిన బోయ తిక్కన్న ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం


క్రీడా జ్యోతిని పట్టుకొని రన్నింగ్ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, రోటరీ క్లబ్ సభ్యులు

ఆదోని అర్బన్: విద్యార్థినీ, విద్యార్థులకు చదువుతోపాటు క్రీడా పోటీలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో న్యూ జనరేషన్ ఆక్టివిటీస్ 2024–25 యాన్యువల్ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు రోటరీ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ చిన్నపరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ దశరథ రామిరెడ్డి, ప్రస్తుత పట్టణాధ్యక్షులు సందీప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సునీల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే, రోటరీ క్లబ్ సభ్యులతో కాగడను చేత పట్టుకుని గ్రౌండ్‌లో తిరిగి ఆటల పోటీలను ప్రారంభించారు. ఆటల పోటీల్లో 40 ఆయా పాఠశాలల నుంచి దాదాపు 1500 మంది పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు కప్‌లతో పాటు సర్టిఫికెట్ అందజేశారు. రోటరీ క్లబ్ పట్టణాధ్యక్షుడు సందీప్‌రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు, యూత్ ఆఫీసర్లు సాబీర్‌అహ్మద్, రాజేష్‌జైన్, సభ్యులు శ్రీధర్‌రెడ్డి, భరత్‌షా, ప్రశాంత్‌గాంధీ, సుబ్బయ్య, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.


తడిసిన మిరపను చూపుతున్న డి.బెళగల్ రైతు యల్లప్ప,(ఇన్‌సెట్) తడిసిన మిరపకాయలు

అకాలవర్షం.. మిరప రైతుకు నష్టం

కోసిగి: ఆరుగాలం కష్టపడి పండించిన మిరప పంట అకాల వర్షం కారణంగా రైతన్నలకు తీరని నష్టం మిగిల్చింది. మండలంలో ఆదివారం వేకువ జామున ఓ మోస్తరులో వర్షం కురిసింది. దుద్ది, డి.బెళగల్, చింతకుంట, కొల్మాన్‌పేట గ్రామాల్లో దాదాపు 100 ఎకరాల మేరకు బోరు బావుల కింద ఎండు మిర్చి సాగు చేసుకున్నారు. మిరప పంట కాపుకు రావడంతో పంట కోతలు కోసి పోలాల్లో ఆరుబెట్టారు. ఈ తరుణంలో అకాల వర్షం కురువడంతో ఆరబెట్టిన మిరప దిగుబడులు తడిసి కాయలు దెబ్బతిన్నాయి. మిరప పంట సాగుకు ఎకరాకు రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు పెట్టుకున్నట్లు రైతులు తెలిపారు. మార్కెట్ క్వింటం రూ.10వేల కన్నా తక్కువ ధర ఉండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో మిరప పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో పెట్టిన పెట్టుబడి రావడం లేదని దిగాలు చెందుతున్న తరుణంలో వర్షం మరింత దెబ్బతీసింది. ప్రభుత్వం మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించి, తడిసిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు.